# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 363722

Editor :

**Joshua Gootam**

Pleading for Restoration of First Century Christianity

సంపుటిక 23 నవంబరు 2002 సంచిక 4


## క్రీస్తు నామము

(The Name of Christ)

ఈ లోకములో ఉద్భవించిన వ్యక్తులందరికంటె యేసు క్రీస్తు ప్రత్యేకమైనవాడు. ఆయన అసాధారణ మానవుడు, ఆయన దేవుని కుమారుడు. యేసు అను పదమునకు రక్షకుడు అని యర్థము. "తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టబడును" (మత్తయి 1:21). క్రీస్తు అను పదమునకు అభిషిక్తుడు అని అర్థము. యేసుక్రీస్తు దైవ మానవుడు. ఆయన మానవుల దేవుడు. క్రీస్తు నామము ఒక అసాధారణమైన నామము. అది బహు అమూల్యమైన నామము. ఆ నామములో గల విశేషతను ఈ రోజు మనము కొంత తెలిసికొందుము.

క్రీస్తు నామమున రక్షణ యున్నది యని బైబిలు

బోధించుచున్నది: "మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెనుగాని, ఆకాశము క్రింద మనష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున మనము రక్షణ పొందలేము" అని అపొ.కా. 4:12లో వ్రాయబడి యున్నది. బాబాలనబడినవారును, గురువులనబడినవారును అనేకులు ఈ లోకములో మనకు కన్పించవచ్చును గాని, వారిలో యే ఒక్కడును ఒక పాపిని రక్షించుటకై తన రక్తాన్ని క్రీస్తువలె చిందించి యుండలేదు. యేసుక్రీస్తు అయితే అనేకుల పాపక్షమాపణ నిమిత్తము తన పవిత్ర రక్తమును సిలువపై చిందించి మనకు విమోచనను అనుగ్రహించుచున్నారు.

## పాపులకు రక్షణ

అందువలననే క్రీస్తు నామము అన్ని నామములకంటెను పైనామమై యున్నది. క్రీస్తు నామములో పాపులకు రక్షణ యున్నది గనుక లోకమందంతయు ఆయన నామము ప్రకటింపబడవలెనని దేవుడు కోరుచున్నాడు : " అందుచేతను పరలోకమందున్న వారిలోగాని, భూమిమీద ఉన్నవారిలోగాని, భూమి క్రింద వున్న వారిలోగాని ప్రతివాని మోకాలు యేసు నామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను" అని ఫిలిప్పీ 2:9-11లో వ్రాయబడి యున్నది.

ఒకడు రక్షణ పొందవలెననిన క్రీస్తు నామమందు విశ్వాస ముంచవలెను. "విశ్వాసములేకుండా దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము; దేవునియొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను

వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" అని హెబ్రీ 11:6లో వ్రాయబడియున్నది. "మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవుని యందు విశ్వాసముంచుచున్నారు, నాయందును విశ్వాసముంచుడి" యని యోహాను 14:1 లో యేసు పలికెను. "తన్ను ఎందరంగీకరించిరో వారి కందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను" అని యోహాను 1:12 బోధించుచున్నది. "దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్య జీవము గలవారని తెలుసుకొనునట్లు, నేను ఈ సంగతులను మీకు వ్రాయుచున్నాను" అని భక్తుడైన యోహాను I యోహాను 5:13లో వ్రాసెను. గనుక మిత్రులారా, యేసుక్రీస్తు నామమందు విశ్వాసము లేకుండా పాపవిమోచన పొందుట అసాధ్యమని గ్రహించండి.

రక్షణపొందుటకు క్రీస్తు నామమందు విశ్వాసముంచుటయే గాక మన పాపముల విషయమై మారుమనసు పొంది ఆయన నామమున బాప్తిస్మము పొందవలెను : "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని అపొ.కా. 2:38 బోధించుచున్నది (2 తిమో 2:19).

## ఆరాధించు నామము

క్రైస్తవుడయిన ప్రతివాడును ప్రభువు నామమున దేవుని ఆరాధించుటకు కూడుకొనవలెనని బైబిలు బోధించుచున్నది. మత్తయి 18:20లో, "ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్య ఉందునని" క్రీస్తు వాగ్దానము చేసెను. క్రీస్తు సన్నిధిని మనము కోరుచున్న యెడల ఆయన నామమున

కూడుకొనుట అత్యవసరము

మనము ఆరాధన చేయునప్పుడు సమస్తమును ఆయన నామమున చేయవలెనని లేఖనములు బోధించుచున్నది : "మరియు మాటచేతగాని, క్రియచేతగాని మీరేమిచేసినను ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయనపేరట చేయుడి" యని కొలస్స 3:17లో వ్రాయబడి యున్నది. కొందరు యేసు తల్లియైన మరియద్వారాను, మృతులైన భక్తుల నామములను బట్టియు ప్రార్థించువారున్నారు. అట్లుగాక మన ప్రార్థన విజ్ఞాపనలు అన్నియు క్రీస్తుద్వారా తండ్రియైన దేవునికి తెలియజేయవలెను. " దేవుడొక్కడే, దేవునికి నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తు యేసను నరుడు" (1తిమోతి 2:5). అందుకే "మీరు నా నామమున దేని నడుగుదురో తండ్రి కుమారుని యందు మహిమపరచబడుటకై దానిని చేతును. నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును" అని ఆయన తన అపొస్తలులకు వాగ్దానము చేసెను(యోహాను 14:13, 14).

సంఘము క్రీస్తు నామమును ధరించుకొనవలెను. సంఘము క్రీస్తుయొక్క పెండ్లికుమార్తెయని చెప్పబడినది. పెండ్లి కుమార్తె ఆయన నామమును ధరించును (ప్రకటన 2:19). క్రీస్తుకు ఒకే ఒక్క పెండ్లికుమార్తె లేక భార్య యున్నది. అదియే ఆయన సంఘము. సంఘము నమ్మదగినది పవిత్రమైనది అయితే, అది క్రీస్తు నామమును ధరించుకొనును. అందువలన క్రీస్తుసంఘమనబడును. అది అస్థిరమైనది అపవిత్రమైనది అయితే క్రీస్తునామమునుగాక వేర్వేరు నామములను ధరించుకొనును. నీవున్న సంఘము క్రీస్తు నామమును ధరించు కొని యున్నదా ?

దేవుని బిడ్డలు క్రీస్తు నామమును ధరించుకొనవలెను. దేవుని

ప్రజలు ఒక క్రొత్త నామమునుబట్టి పిలువబడుదురని యెషయా 62:2లో ప్రవచింపబడెను. క్రొత్తనిబంధనలో దేవుని ప్రజలు క్రైస్తవులనబడిరి యని అపొ.కా. 11:26లో మనము చదువగలము. క్రైస్తవుడు అనగా క్రీస్తువంటివాడు, క్రీస్తును ధరించినవాడు అని యర్థము. క్రైస్తవుడు అనునది దేవుడు మనకు ఇచ్చిన నామమై యున్నది. ఆ నామముద్వారా మనము దేవుని మహిమపరచవలెను. కొందరు క్రైస్తవులమని చెప్పకొనుటకు సిగ్గుపడుదురు. అట్టివారి విషయమై క్రీస్తుకూడ తీర్పుదినమందు సిగ్గుపడును. అయితే "ఎవడైనను క్రైస్తవుడై నందుకు బాధ ననుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచవలెను" అని । పేతురు 4:16లో వ్రాయబడి యున్నది.

యేసుక్రీస్తునందు రక్షణ యున్నది. ఆయన నామమందు మనకు నిత్యజీవము ఉన్నది. ఈ లోకమందున్న పాపులందరును క్రీస్తు యేసు ద్వారా రక్షణ పొందవలెనని దేవుడు కోరుచున్నాడు. ఆయన నామమును గూర్చి మనము వినగల్గునట్లు సర్వలోకమందంతటా సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడియని ఆయన తన అనుచరులను అజ్ఞాపించెను (మార్కు 16:15). ఆయన నామమును గూర్చి మనము చదువుకొని విశ్వసించి, నిత్యజీవము పొందునట్లు క్రొత్త నిబంధన గ్రంధమును ఆయన మనకు వ్రాయించి యిచ్చెను : "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును" అందున్న సంగతులు వ్రాయబడెను (యోహాను 20:31).

క్రీస్తు నామములోని విశేషతను నీవు ఈపాటికే గ్రహించి యుందువని నా విశ్వాసము, అట్లయిన ఆయన నామమందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు బొంది,

పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మముపొంది ఈనాడే ఆయన నామమును నీవు ఎందుకు ధరించుకొనరాదు ?

# సార్వ భౌముడైన క్రీస్తు

(Christ is Sovereign)

1. క్రీస్తును మనజీవితములో సార్వభౌమునిగా అంగీకరించుట మనవిధి మరియు మనభాగ్యము; క్రీస్తు ప్రభువు సార్వభౌముడు. సర్వ జనులును రాష్ట్రములును ఆయా భాషలు మాట్లాడువారునుఆయనను సేవించునట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయన కీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది. అదెన్నటికిని తొలగిపోదు. ఆయన రాజ్యము ఎప్పుడును లయముకాదు" (దానియేలు 7:13, 14).

2. గుమ్మములారా, మీ తలలు పైకెత్తుకొనుడి. మహిమగల రాజుప్రవేశించునట్లు ...... లేవనెత్తికొనుడి. కీర్త 24:7. పునరుద్ధానుడైన క్రీస్తు ప్రభువు పరలోక ప్రవేశము చేయునపుడు దూతకోటి ఆయన కిచ్చు ఆహ్వానము తెలియజేయు ప్రవచనమిది.

3. పెంతెకొస్తు దినమున పేతురు మాటలు - "మీరు సిలువ వేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెను" (అ॥కార్య 2:36).వారు నిరాకరించిన యేసును వారు ప్రభువుగా గుర్తింపవలయును. వేరు గత్యంతరము లేదు అని పేతురు ఉద్ఘాటించెను.

4. అపో. పౌలు హెబ్రీ పత్రికలో వ్రాయనదేమి ? "దేవ దూతలకంటె కొంచెము తక్కువ వాడుగా చేయడిన యేసు మరణము పొందినందున మహిమా ప్రభావములతో కిరీటము ధరించిన వానిగా చూచుచున్నామము" 2:9.

5. పౌలు మరొక చోట చెప్పునది ---- "ఆయన ఆ బలాతిశయముచే క్రీస్తును మృతులలోనుండి లేపి సమస్తమైన అధిపత్యము కంటెను అధికారము కంటెను శక్తి కంటెను ప్రభుత్వము కంటెను ...... ఎంతో హెచ్చుగా పరలోకమందు ఆయనను ...... కూర్చుండ బెట్టు కొనియున్నాడు. ఎఫె:20, 21 ఈ మాటలలో మనము గమనించునదేది? క్రీస్తు ప్రభు అధిష్ఠించిన స్థానమునకు మించి ఉన్నతమైన మరొక స్థానము లేదు, మరియు ఈ మాటల గమనించుము----సమస్తమైన----ఎంతో హెచ్చుగా----ప్రతి నామము కంటెను"-----

6. ఫిలిప్పీ 2:9-11 చూచెదము. అందుచేతను (అనగా మరణము పొందినందుచేత) పరలోకమందున్న వారిలో గాని, భూమి మీద ఉన్న వారిలోగాని, భూమి క్రింద ఉన్నవారిలో గాని, ప్రతివాని మోకాలు . . . ప్రతివాని నాలుక . . . అధికముగా హెచ్చించి; ప్రతినామమునకు పైనామము . . . అధికముగా హెచ్చించి . . . అనుమాటలు గమనించుము.

7. రోమా 9:5 చూడుము ... "ఈయన సర్వాధికారియైన దేవుడై యుండి నిరంతరము స్తోత్రార్హుండై యున్నాడు".

8. యేసు తానే చెప్పిన మాటను గమనించుము ..."పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికార మియ్యబడియున్నది" మత్త 28:19, 20. సర్వాధికారము అనుమాటగమనించుము.

9. ప్రకటన గ్రంధములో చాల చోట్లలో ప్రభువు రాజులకు రాజును ప్రభువులకు ప్రభువని చెప్పబడినది (ప్రక 5:9-14; 17:14; 19:16). నిరాకరింపబడి, శిలువ వేయబడి, చనిపోయిన యేసు పునరుత్థానము నొందినందున-ఉన్న తలోకములో సర్వాధికారము నొందిన వాడాయెను. ఆ మహోన్నత స్థానమునకు తాను అర్హుడనని పునరుత్థానము ద్వారా నిరూపించుకొన్నాడు.

## క్రీస్తు సంపూర్ణుడు

ఈ దినములలో చాల మంది పండితులైన క్రైస్తవేతరులు ఆయనను చాలా పొగడుచున్నామని తలంచి, - "యేసు చాల గొప్పవాడు గొప్ప నీతులు బోధించినాడు, అనేక సత్యములు బయలు పెట్టినాడు అని అందురు. క్రీస్తు ప్రభువును మానవులతో పోల్చి వారి కంటెను, వీరి కంటెను అగ్రగణ్యుడు అనుటకూడ నేరమేయగును. ఆయన సత్యవాక్కులు మాత్రము బోధించినవాడు కాదు ; ఆయనే సత్యము; ఆయన మంచిమార్గము చూపినవాడు మాత్రమే కాదు, ఆయనే మార్గము; ఆయన చాల మంచివాడు అనుట చాలదు. ఆయనే పరిశుద్ధుడు, ఆదర్శ పురుషుడు అను అంశముపై సర్ ఎస్. రాధాకృష్ణ (President of the Indian Union) ఒకసారి మాట్లాడుచు క్రీస్తు నేటి దినములలో జీవించుచున్న ట్టైన ఆయనే మాదిరి పురుషుడు అని చెప్పగలము అని తన ఉపన్యాసములలో పలికెను. క్రీస్తులో సంపూర్ణత గలదు, అంతేకాదు సర్వ సంపూర్ణతగలదు. నీతిలో సంపూర్ణుడు ప్రేమలో సంపూర్ణుడు, త్యాగములో సంపూర్ణుడు అందుకు ఆయన సర్వసంపూర్ణత గలవాడని చెప్పబడినది (కొల 2:9).

ఒకడు క్రీస్తు యొద్దకు రాకముందు తన యిష్ట మొచ్చినవైపుకు పోవుటకు స్వతంత్రత గలదు. కుడికా, ఎడమకా ? రక్షణవైపా నాశనము తట్టా,? గాని ప్రభువును అంగీకరించిన పిదప అతడు సంపూర్ణముగ అన్ని విషయములలో ప్రభువుకు లోబడవలయును. ఏలయన ఆయన సర్వములో సర్వమైయున్నాడు. "If Jesus is not my all in all, He is nothing

॥ ॥" అని ఒక భక్తుడు పలికినాడు.

### సంఘానికి ఆయనే ప్రభువు

అన్ని విషయములలో ఆయన మాట వినవలయును అని ఆయనను గూర్చి ప్రవక్తలు ప్రవచించిరి. (అ॥ కా॥ 3:22). క్రీస్తు ప్రభువుకును సంఘమునకును గల సంబంధమేమి? అన్నిటిలోను సంబంధమే. సంఘము నూటికి నూరుపాళ్లు ఆయనది. దాని ఉనికికి ఆయనే కారణము (మత్త 16:18. అకా 20:28). దాని కొనసాగింపుకు, అది సంపూర్ణ మహిమలో ప్రవేశించుటకు ఆయనే ఆధారభూతుడు. సంఘ మెప్పు డేర్పడినది అని అడిగినప్పుడు - పెంతెకోస్తుదినమున ఏర్పడినదని బైబిలు చరిత్ర చెప్పుచున్నది. కాని నిజముగా చూస్తే అనాదికాలమందే, అనగా ఈ లోకము పుట్టకమునుపే అని ఉన్నది. ఎక్కడున్నది? దేవుని సంకల్పములో ఉన్నది. (ఎఫె. 3:3-11). సంఘమునకు గల ఔన్నత్యస్థానము దీనివలన మనము గ్రహించుచున్నాము. సంఘ ఔన్నత్యమును గూర్చిన మరొక ప్రవచనము మరీ ఆశ్చర్యమును గొలుపును. యెషయా 2:2లో యెహోవా మందిర పర్వతము కొండలన్నిటి కంటె ఎత్తుగా ఎత్తబడును అని చెప్పినాడు. దాని భావమేమి? అంతకన్న ఉన్నతస్థానము గలది మరొకటి లేదు. ఇంత ఔన్నత్యస్థానము, ఏకైక స్థానము సంఘమునకున్న దని క్రైస్తవ ప్రపంచము గ్రహించినచో ఎంత ఆనందకరముగ నుండును. కాని చాల అల్పభావములు సంఘమును గూర్చి ప్రపంచము నావరించినవి. మా సంఘమునకు అధికారి బిషప్పు అని ఒకడు, మా సంఘాధికారి ప్రెశిడెంటు అని మరొకరు చెప్పుచున్నారు. నాకే సంఘము అక్కర లేదు అని కొందరు, నాకన్ని సంఘములు ఒక్కటే అని కొందరు ఏల చెప్పవలసి వచ్చినది ? క్రీస్తుప్రభు సంఘమునకు శిరస్సు అనియు, ఆయన పేరుతో

సంఘము అనాది కాలములో పిలువబడినదనియు (రోమా 16:16) బైబిలు తేట తెల్లముగ జెప్పుచుండ బాపిస్టు, లూధరస్ పెంతెకోస్తు అను వేల కొలది పేర్లతో సంఘమును పిలుచు టేల? క్రీస్తు ప్రభువు, సర్వాధికారి అయినచో, సార్వభౌముడైనచో అన్ని విషయములలో ఆయన కేల లోబడియుండకూడదు ?

మనవ కల్పిత నామములలో గల లోపములు మతశాఖల పెద్దలు గ్రహించకపోలేదు. చార్లెస్ స్పర్జన్ అను బాప్టిస్టు సంఘము నాయకుడు చెప్పినదేమి ? "బాప్టిస్టు అను పేరుగల ప్రతివాడు చావవలెననియు క్రైస్తవుడను పేరు గలవాడు మాత్రము జీవించవలెననియు నేను కోరుచున్నాను". ఈ మాటలను బట్టి మతశాఖల కల్పిత సిద్ధాంతములు కేవలము తప్పు అని ఆయన ఆవేదన మనకు స్పష్టమగుచున్నది.

సంఘమును గూర్చి మరియొక తేలికమాట మతప్రంచములో చూచుచున్నాము---"యేసుప్రభు అనలు రాజ్యస్థాపనకే ఈలోకమునకు వచ్చిననాడు. గాని యూదులు ఎదురాడినందున సంఘమును నిర్మించినాడు. ఇది తాత్కాలికమే. మరల రెండవరాకడలో ఆయన రాజ్యమును స్థాపించును. అప్పుడు సంఘము అదృశ్యమగును' ఇదెక్కడి మాట ? ఈ వికృత బోధకు ఆధారమేమి ? ఇక్కడ రెండు విషయము లాలోచించవలయును.

1. యూదులెదురాడి నందున రాజ్యమును కట్టలేకపోయినాడు? అనగా తాను వచ్చిన పని నెరవేర్చ లేకపోయినాడన్న మాట, అది అబద్ధము. కేవలము అబద్ధము. యోహా 17:4లో చెప్పబడిన మాటేమి "చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చితిని" అని తండ్రితో ప్రార్థనలో మన ప్రభువు చెప్పుచున్నాడు. ఇది తేటగా లేదా ? ఆయన చేయలేకపోయినది ఏమున్నది ? సంఘము స్థాపించుట

తండ్రి చిత్తమే.

2. రాజ్యము-సంఘము ఒక్కటేగదా, క్రైస్తవుడు ఆయన సంఘములో (శరీరము) నున్నాడు అనగా ఆయన రాజ్యములోను ఉన్నాడు (కొలస్స 1:13, 18). రెండును ఒక్కటే (అ.పొ. 20:28 ప్రక 5:9-10.) క్రీస్తు సంఘములోనికి ప్రవేశమెట్లు ? క్రీస్తుప్రభువు యొక్క సార్వభౌమత్వమును మనము గుర్తించినచో ఆయన సంఘములోనికి ఆయన పెట్టిన షరతులను అక్షరాల పాటించవలయును. వాటికి కలుపుటగాని, వాటినుండి తీసివేయుటగాని, వాటికి మెరుగు పెట్టుటగాని మనకు తగదు. యేసుక్రీస్తు సార్వభౌముడైనచో, సంఘము మహిమాన్వితమైనదైనచో అందుప్రవేశించుటకు ప్రభువు పెట్టిన షరతులతో మనము చెలగాటము లాడకూడదు. "విశ్వాసముంటేచాలు, బాప్తిస్మ మక్కరలేదు అని ఒకరు, ఏరీతిని బాప్తిస్మము పొందినా పరవలేదు అని మరొకరు ఏల చెప్పవలని వచ్చెను? ఒక గొప్ప ఆంగ్లికన్ వేదాంతి ఈ రీతిగ చెప్పుచున్నాడు "ముంచడము ద్వారా బాప్తిస్మము ఆ దినములలో సరిపోయింది. ఈ దినముల కాలాగు అక్కరలేదు".-- ఇదెక్కడి మాట? ఒక్కొక్క కాలమునకు ఒక్కొక్క రీతిని బాప్తిస్మము లివ్వవలెనా ? ఆలాగున క్రీస్తు చెప్పినాడా ? ఈ వ్యర్థ పారంపర్యాచారము నుండి క్రైస్తవ లోకము దూరము కావలెనని కోరుదము. మన ఆరాధనలు సామాన్య మైనవిగును ఆడంబరములు లేనివిగను ఉండవలెనని వాక్యముచూపించుచుండ వ్యర్థమైనవియు, వివిధములైనవియునైన ఆచార కాండతో మునిగిపోయినవి

## గృహానికి క్రీస్తే ప్రభువు

గృహములలో క్రీస్తుకుగల స్థానము చూచెదము-కుటుంబ జీవితములో క్రీస్తుకు సంపూర్ణ అధికారము లేని గృహములు క్రైస్తవ గృహములు కావు. తలిదండ్రులు మాత్రము కాక, పూచీ నెరిగిన, బిడ్డలు కూడ రక్షణ పొందినవారై యుండవలయును. "ప్రభువైన యేసు నందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీయింటివారును రక్షణ పొందుదురు" అని పౌలు చెప్పిన మాటలు (అ.కా. 16:31) ఈ దినములలో మన క్రైస్త గృహములు పాటించవలయును. "నీయింటివారు" అని చెప్పునపుడు బిడ్డలుకూడ రక్షణపొందవలెనను భావ మక్కడనున్నది. అనేక గృహములలో అది చాలలోటుగానున్నది. మతవిద్య బిడ్డలకు చిన్న నాటినుండియే తలిదండ్రులచే నేర్పబడవలయును. ఆ పనిని చాలమంది తల్లిదండ్రులు సంఘమునకు వదలి వేయుచున్నారు. అది సరికాదు. బిడ్డలకు చిన్న నాటినుండియే దేవుని గూర్చిన విధులు నేర్పబడవలెనను నియమము ఇశ్రాయేలు జనాంగమునకు గలదు. దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలు జనాంగమునకు ఆజ్ఞాపించినదేమి ? నీ బిడ్డలకు, యింటను బైటను పండుకొనునప్పుడు త్రోవనడుచునప్పుడు ఆయన కట్టడలను నేర్పించుమని ఆజ్ఞ యిచ్చెను (ద్వితి 11: 18-20). ప్రపంచ జనాంగములలో మత విద్య బాల్యము నుండి బిడ్డలకు బోధించునది యూద జనాంగమొక్కటే. తిమోతికి మతవిద్య నేర్పిన వారెవరు? (2 తిమొ 1:5, 3:15). అతని తల్లియు, అవ్వయునై యుండిరి. తల్లి యూదురాలై యుండియు, గ్రీకు వానిని పెండ్లి యాడుట సంభవించినది. అలాంటివి వలదు. యూద మతమునకు దూరమగుట సాధ్యము మరియు యూదులు లేని అన్యజనాంగముల మధ్య

జీవించుచున్నది. అది అన్యజనులు, విగ్రహారాధికులతో నిండిన పట్నము (అ.కా. 14:6). అలాంటి పరిస్థితులలో ఆమె యింకను మత భ్రష్టత్వము నొంది యుండవలయును, గాని అట్లు జరుగలేదు. ఆమెలోను, ఆమె తల్లిలోను విశ్వాసము జీవించియే యున్నది. అందుచేత తమ బిడ్డకు ఉగ్గుపాలతో యెహోవా దేవుని గూర్చి నేర్పినారు. ఈ దినములలో అలాటి తల్లులు మన క్రైస్తవ కుటుంబములలో ఉండవలెను. ప్రతి క్రైస్తవ కుటుంబమును, చిన్న పరలోకముగ తయారు చేసికోవలసిన పూచీ తల్లిదండ్రులకు గలదు. కుటుంబము అననేమి ? దాని నిర్వచన మేది అని అడిగినప్పుడు, ఒకరీలాగు చెప్పిరి. ప్రేమ, పరిశుద్ధత, క్షమాపణ, త్యాగము ఏ యింట ఉన్నదో అదే క్రైస్తవ గృహము. క్రీస్తు సర్వాధిపతియని, సార్వభౌముడని స్థానిక సంఘములును, క్రైస్తవ గృహములను గ్రహించిననాడు మనకు గొప్ప ఆశీర్వాదములు కలుగును.

**T. జ్ఞానానందము**, కాకినాడ.

## ప్రభురాత్రి భోజనము

(The Lord's Supper)

క్రీస్తు త్వరలో సిలువపై చనిపోవుచున్నట్లు ఆయన ఎరుగును. ఆయన సమాధి చేయబడి తిరిగిలేచి కొద్ది కాలము ప్రత్యేక్షమైన తరువాత పరమందున్న తన తండ్రి యొద్దకు తిరిగి వెళ్ళుదునని కూడ ఆయన యెరుగును. గనుక ఆయన శిష్యులాయనను జ్ఞాపకముంచు కొనునట్లు వారికొక సంగతిని ఆయన ఇయ్యవలెనని ఆశించెను. ఆయున మరణించక ముందుఒక రొట్టెను తీసుకొని దాని నాశీర్వదించి, విరచి తనశిష్యుల కిచ్చి-మీరు తీసుకొని తినుడి; ఇది నా శరీరమని చెప్పెను, మరియు ఆయున గిన్నె పట్టుకొని

కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, వారికిచ్చి - దీనిలోనిది మీరందరు త్రాగుడి. ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" అని చెప్పెను (మత్తయి 26:26-28).

ప్రభువుయొక్క మరణ, సమాధి, పునరుత్థానముల యనంతరము ఆయన పరలోకమునకు తిరిగి వెళ్ళి తనసంఘమును స్థాపించెను. తదనంతరము కొరింధులో యున్న క్రైస్తవులకు ప్రభురాత్రి భోజనము యొక్క ప్రాముఖ్యతను గూర్చి అపో.పౌలు వ్రాసెను. అతడిట్లనెను : "నేను మీకు అప్పగించిన దానిని ప్రభువు వలన పొందితిని. ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రి యొక్క రొట్టెను ఎత్తికొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి దానిని విరిచి-యిది మీ కొరకైన నాశరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను. ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన పాత్రను ఎత్తికొని-యీ పాత్ర నారక్తము వలనైన క్రొత్త నిబంధన; మీరు దీనిలోనిది త్రాగునప్పుడు డెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను. మీరు ఈ రొట్టెను తిని, యీ పాత్రలోనిది త్రాగునప్పు డెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు. కాబట్టి యెవడు అయోగ్యముగా ప్రభువు యొక్క రొట్టెను తినునో లేక ఆయన పాత్రలోనిది త్రాగునో, వాడు ప్రభువుయొక్క శరీరమును గూర్చియు రక్తమును గూర్చియు అపరాధియగును. కాబట్టి ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షించు కొనవలెను; అలాగుచేసి ఆ రొట్టెను తిని, ఆ పాత్రలోనిది త్రాగవలెను. ప్రభువు శరీరమని వివేచింపక తిని త్రాగువాడు తనకు శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు" (1 కొరింధి 11:23-29).

ఈ భోజనములో రొట్టె క్రీస్తు శరీరమునకు, గిన్నె క్రీస్తు రక్తమునకు

గురుతుగా యున్నది. రొట్టె పులియని రొట్టె, గిన్నె ద్రాక్షారసమైయున్నవి. ఇవి నిజముగా క్రీస్తుయొక్క శరీర రక్తములు కావుగాని క్రీస్తు శరీర రక్తముల జ్ఞాపకార్థముగా వాటిని సేవించవలెను. గిన్నెను గూర్చి మాట్లాడునప్పుడు గిన్నెలోయున్న దానిని గూర్చియే గాని గిన్నెను గూర్చి కాదని గ్రహించవలెను. గిన్నెనుగూర్చి చెబుతూ ఆ పాత్రలోనిది త్రాగవలె నన్నపుడతడు అదే భావము వ్యక్తపరచెను.

ప్రభురాత్రి భోజనమును ఎంతతరచుగా ఆచరించవలెను ? కొందరు నెలకొక సారనియు, మరికొందరు సంవత్సరమున కొకసారయనియు చెప్పుదురు. మరల ఏదినమందు ప్రభురాత్రి భోజనము నాచరించవలెను ? ఈ ప్రశ్నలకు జవాబునిచ్చు మాదిరి మనకొకటి యున్నది. త్రోయలో యున్న క్రైస్తవులతో పౌలు కూడుకొనెను. ఆదివారమున శిష్యులు రొట్టె విరుచుటకు కూడినప్పుడు, పౌలు మరునాడు వెళ్లనై యుండి వారితో ప్రసంగించుచు, అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడు చుండెను అని దైవ రికార్డులో యున్నది. (అపొ.కా. 20:7). మనము ఆసందర్భము నంతటిని చదివిన యెడల ఆది వారమునాడు శిష్యులతో కూడుకొని రొట్టె విరుచునట్లు లేక ప్రభురాత్రి భోజనము పాలు పొందగల్గునట్టు పౌలు త్రోయలో కొన్ని దినములు ఎక్కువ గడిపెనని గ్రహించగలము.

1 కొరింథి 11:36లో "మీరు ఈ రొట్టెను తిని ఈ పాత్రలోనిది త్రాగునపుడెల్ల" యని పౌలు అనుచున్నాడు. అయితే ఇది ఎంతకాలమున కొకసారి? క్రైస్తవులు ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడుకొందురు గనుక, వారు ప్రతి ఆదివారమున ప్రభురాత్రి భోజనము నాచరించవలెనని దాని భావము. లేనియెడల ఆరాధన నుండి ఈ ప్రత్యే భాగమును తొలగించు అధికారము మనకు ఎక్కడ యున్నది ?

అంతేకాక పౌలును, త్రోయలోని క్రైస్తవులును ఆదివారము నాడు రొట్టె విరిచిన మాదిరి మనకున్నది గనుక అది ఏ దినమును జరిగించబడవలెనో యను సంశయము ఇకలేనేలేదు. దానికి వ్యతిరేకముగ యున్న మాదిరిగాని, ఆజ్ఞగాని దేవుని వాక్యములో లేనేలేదు. మానవుడు చాల ఆదమరుపుగల వాడని ప్రభువు ఎరుగును, గనుక మన మాయనను జ్ఞాపక ముంచుకొనునట్లు ఆయన ఈ భోజనమును నెలకొల్పెను. ఈ స్మారకమును ప్రతి ప్రభువు దినమందు జరిగించవలెనని ఆయన విపులీకరించెను. ఆయనను తరచు జ్ఞాపకము చేసికొను నిమిత్తమును, ఆయనను జ్ఞాపకము చేసికొనుటలో మనము క్రమముగా యుండు నిమిత్తమును అట్లు ఆదేశించారు.

ప్రభురాత్రి భోజనములో పాలు పొందుటద్వారా మనము క్రీస్తు మరణమును వెనుకకు తిరిగి చూచుటయేగాక ఆయన తిరిగి వచ్చునను విశ్వాసమును కలిగి దానిని లోకమునకు ప్రచురింతుము. ఇది చాలా తీవ్రమైన సంగతి గనుక దానిని నిష్కపటముగ జరిపించవలెను. దానిని చులకనగా ఆచరించినవాడు క్రీస్తును మరల సిలువ వేసినట్లు ఆయన శరీరమును గూర్చియు, రక్తమును గూర్చియు అపరాధియగును.

ప్రభురాత్రిభోజనము నెవరు ఆచరించవలెనో, ఎవరు ఆచరించకూడదోయని చెప్ప హక్కు యెవరికిని లేదు. దానిలో పాలు పుచ్చుకొనవలెనో లేదో ప్రతివాడు తన్ను తాను పరీక్షించుకొనవలెను. అది క్రైస్తవుని కొరకు మాత్రమే ఇయ్యబడినది, నిజమే. అయితే చివరిగా క్రీస్తు మాత్రమే తీర్పు తీర్చగలవాడు. అందువలన నీవు పాలు పుచ్చుకొనరాదని చెప్ప అధికారము ఎవరికినిలేదు.

నీవు ప్రభు రాత్రి భోజనములో పాలు పుచ్చుకొను చున్నావా ? ఎందువలన ? ఎప్పుడు ? ఎంతకాలమున కొకసారి ? దేవుని వాక్యమునుబట్టి ఈ విషయములను గూర్చి జాగ్రత్తగా ఆలోచించుము. దేవుని మార్గము మాత్రమే సరియైన మార్గము.

-జె.సి.ఛోట

## "ప్రభువు నామమును బట్టి ప్రార్థనచేసి రక్షింపబడుట"

(Call upon the Lord and be Saved)

రోమా 10:13-16

"ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయువాడెవడోవాడు రక్షింపబడును" (రోమా 10:13). ప్రభువు నామమున ప్రార్థన చేయుట మానవునికున్న ప్రాముఖ్యమైన పని. ఇశ్రాయేలీయులు ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేయుట మానినప్పుడు వారి నీతియంతయు మురికి గుడ్డలవలె యుండెను (యెష 64:4-7) మనుష్యులందరి సత్క్రియలన్నియు మురికి గుడ్డలని దీని భావము కాదు, ఏలయనగా క్రైస్తవుల సత్క్రియలు దేవుని మహిమపరచునని బైబిలు బోధించుచున్నది ( మత్తయి 5:16).

ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేయడంలో పాపి తాను నశించిన స్థితిలో యున్నానని గ్రహించుకొనడం, రక్షింపబడుట అవుసరమని గ్రహించి రక్షణ కోరుకొనడం ఇమిడియున్నాయి. తనకు క్రీస్తులో నమ్మిక కలిగియుండడం దానిలో యున్నది. అతడు పిలువ గలవాడెవడును ఇకలేడు గనుక ప్రభువును పిలుస్తాడు (యోహాను 6:68).

## పాపి ఎట్లు పిలుస్తాడు ?

యేసు ఇట్లన్నాడు : "ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్త 7:21). ఆయన చిత్తాన్ని విని దానిని జరిగించువానినే ప్రభువు వింటాడు (యోహాను 9:31).

ప్రభువు నామమున పిలచి రక్షింపబడుట యెట్లో అపొ. కార్యములు రెండవ అధ్యాయములో మనకు కనబడును. ఆ అధ్యాయము 21వ వచనంలో యోవేలు చేసిన ప్రవచనము ఈలాగు చెప్పబడినది: "అప్పుడు ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయు వారందరును రక్షింపబడుదురు" (అపొ.కా. 2:21). 47వ వచనములో కొందరు రక్షింపబడి ప్రభువుచే సంఘముతో చేర్చబడినట్లు మనము చూడగలము.

ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేసి రక్షింపబడుట యెట్లో తెలిసికోవాలంటే వారేమి చేసారో మనం తెలిసికోవాలి. ఏలయనగా వారి రక్షణలో యోవేలు ప్రవచన నెరవేర్చున్నది. వారు మారు మనస్సు పొందారు, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందారు (అపొ.కా. 2:38-41). అందువలననే అననీయ సౌలుతో "లేచి ఆయన నామమున బట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీపాపములు కడిగి వేసుకొనుమని చెప్పెను" (అపొ.కా. 22:16).

నీవు సరియైన రీతిలో ప్రభువు నామముబట్టి ప్రార్థనచేసావా? నీవు క్షమింపబడి రక్షింప బడాలంటే అట్లు చేయాలి, నీవు మారు మనస్సు పొందిన విశ్వాసివైతే ప్రభువు నామమును ఒప్పుకొని పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందు, రక్షింపబడును.

## క్రైస్తవుడు అనగా నేమి ?

## ఒకడు క్రైస్తవుడెట్లు కాగలడు ?

(WHAT IS A CHRISTIAN ? &
(WHAT MAKES ONE A CHRISTIAN)

క్రైస్తవుడు అంటే క్రీస్తును వెంబడించిన వాడు అని అర్థము. యేసుక్రీస్తు, ఆయన శిష్యులు బోధించిన రక్షణా సంకల్పమునకు ఎవరు విధేయులయ్యారో వారే క్రైస్తవులు. ఈ సంకల్పము ఆచరించుటకు చాలా తేలికైనది.

......... యేసు దేవుని కుమారుడని విశ్వసించవలెనని ఆయన బోధించెను (యోహా 8:24)

......... మన పాపముల నుండి మారు మనస్సు పొందవలెనని ఆయన బోధించెను. (లూకా 13:3)

......... మన విశ్వాసము మనుష్యుల యెదుట ఒప్పుకొన వలెనని ఆయన ఆజ్ఞాపించెను (మత్తయి 10:32)

.........రక్షింపబడుటకు బాప్తిస్మము పొందవలెనని ఆయన బోధించెను (మార్కు 16:16)

యేసుక్రీస్తు భూమిపై జీవించిన మాదిరిని క్రైస్తవుడు అనుసరించ వలసి యున్నది. మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తల్లో క్రీస్తు జీవిత చరిత్ర వ్రాయబడింది. దేవుని మనము సంతోషపరచగలుగునట్లు యేసు ప్రభువు మాదిరిని మనము అనుసరింప వలసి యున్నది.

ప్రభువు సంఘానికి చెందిన వారే క్రైస్తవులు. క్రీస్తు స్థాపించిన సంఘమందు సభ్యులమై యుండాలి. మానవులు స్థాపించినవి

ఆయనకు చెందవు. స్థానిక సంఘమందు సభ్యులు దేవునికి ప్రయోజనకరమైన వ్యక్తులుగ జీవించాలి. స్థానిక సంఘములో క్రీస్తు పరిచర్య ద్వారా ఆయనకు ప్రయోజనకరమైన వ్యక్తులుగ ఉండాలి. ఆదివారం ఆరాధనలలో, బైబిలు తరగతులలో, సంగఘ సమావేశాల్లో పాలుపొంది, పఠనము మరియు ఆరాధన జరిగించాలి. దీనివలన ప్రతి వ్యక్తిగత క్రైస్తవుడు విశ్వాసమందు బలపడుట మాత్రమే గాక, సహోదరులలో స్నేహభావం, పరస్పర అవగాహన ఏర్పడుతుంది. క్రైస్తవ జీవితంలో కలిగిన సమస్యలలో ఒకరి కొకరు సహకారులుగా నుండుటకు ఈ సహవాసము ఉపకరిస్తుంది.

క్రీస్తు సంఘము క్రీస్తు శరీరమైయున్నది, గనుక మన మందరం భూమి మీద ఆయన పనిని కొనసాగించునట్లు ఈ పని భారమును మనకు అప్పగించెను. మనమే ఆయన చేతులు, నోరు మరియు పాదములు. ఆయన శిరస్సుగ మనతోనే ఉన్నారు. క్రీస్తు పనికొరకు జీవించునట్లు సంఘముగ మనం దీనిని కొనసాగించాలి. క్రీస్తే నాయందు జీవించుచున్నాడని పౌలు వ్రాసెను. (గలతి 2:20) అంటే క్రీస్తే ఆయన యందు జీవించి యుండగ పౌలు ఆయన పనిని కొనసాగించెను.

యేసు తన శిష్యులతో మీరు "లోకమునకు వెలుగై యున్నారు' అని చెప్పెను. (మత్త 5:16) లోకము మన సత్క్రియలను చూచి దేవుని మహిమ పరుచునట్లు వారి యెదుట మన వెలుగును ప్రకాశింప జేయాలి మనము మంచి క్రైస్తవ జీవితమును జీవించవలెను. సంఘములో పట్టుదలతో పనిచేయకుండ దేవునికి మహిమను తీసుకొని రాలేము.

- E.K.V.ప్రసాదరావు